ఆ రాత్రి చక్రధరరావ్ చీటీ తీసి

"కాలవాహిని అలల వాలున
కదిలిపోవుట సులభతరమే
ఎదను ధర్మము మెదలుచుండగ
ఎదురు యీదుట పరమ కఠినము
ప్రతిన బూనుట ఇలను సులభము
సఫలతా సంప్రాప్తి కఠినము"

అని చదివి చిర్నవ్వుతో అర్థమయినట్టుగా తల పంకించి, సున్నితంగా తన కర్తవ్యాన్ని బోధించిన స్వామివారికి వందనాలర్పించి పడక గదికి చేరుకున్నాడు.

—ప్రభు

---

వసంతకి స్టీలు సామాను అంటే తగని పిచ్చి. పాతబట్ట లేసి ఎప్పుడూ ఏదో ఒక గిన్నో, చెంబో, పళ్ళెమో కొంటూ వుండేది. ఇంటికి కావలసినవన్నీ కొన్నది కానీ, స్టీలు డ్రమ్ మాత్రం కొనటం పడలేదు. స్టీలు సామాన్లవాడు ఏదో వంక పెట్టి బేరం కుదరనిచ్చేవాడు కాదు. ఎలా గయినా మీడియమ్ సైజు డ్రమ్ కొనాలని ఆమె తాపత్రయం. డ్రమ్ కోసం, పాత పట్టుచీరలు కూడా పాత బట్టల మూటలో చేర్చింది. అప్పటికి నాలుగు నెలలబట్టీ పోగుచేస్తోంది. ఎలాగయినా, ఈసారి పైన డబ్బులేసి అయినాసరే డ్రమ్ కొనాలని ఆవిడ పట్టుదల.

భర్తకి భోజనంపెట్టి పంపింది. తనుకూడా భోజనంచేసింది. ప్రక్కవాటావాళ్ళు సెలవలకి ఊరెళ్ళడంతో, ఏం తోచక ఏదో పుస్తకం పట్టుకుని మంచంమీద వాలింది. కథ సగం చదువుతుండగానే "స్టీలు సామాన్లోయ్....స్టీ....లు సామా....న్లోయ్", అని కేకేసాడు రోడ్డుమీద స్టీలు సామాన్లవాడు. గబగబా పుస్తకం మంచంమీద పడేసి, కిటికీ దగ్గరకొచ్చి చూసింది. వాడి బుట్టలో స్టీలు డ్రమ్ మీడియమ్సైజుది. ఇంకా చాలా సామాన్లున్నయ్. డ్రమ్ముని చూడగానే లాటరీ తగిలినట్టు సంతోషపడ్డది. గబగబా తలుపుతీసి స్టీలు సామాన్లవాడిని పిలిచింది.

లోపలికెళ్ళి పెద్ద బట్టలమూటని తెచ్చి వాడిముందు పడేసింది. "ఇవిగో ఇవీ బట్టలు" అంటూ బట్టలు చూపించింది. వాడు బట్టల్ని ఒకసారి చూసి "ఇదుగోనండమ్మా ఈ గిన్నె వస్తుంది." అంటూ చిన్న గిన్నె చూపించాడు.

"ఇంకా నయం ! ఈ బట్టలికి ఆ స్పూను వస్తుంది అన్నావు గాదు! మేమేం ఈ వూరికి కొత్తనుకుంటున్నావా ! ? నీవే కొత్తలాగున్నావ్. ఇన్ని కొన్నా సామాన్లు" అంటూ ఏకబిగిన చేతులూపింది.

"సరే కానీయండమ్మా. ఇదిగో ఈ బేసి నొస్తుంది. అంతకంటే రాదమ్మా. పోనీ ఇంకా రెండు జరీచీరలేయండమ్మా" అన్నాడు.

"సరే ఇంకో చీర వేస్తాను గాని, ఆ డ్రమ్ ఇస్తావా ?"

"అమ్మో ! డ్రమ్మే ! ఈ గుడ్డలకా ? రాదండమ్మగారు. అయినా ఇయెందుకండీ. దృతరాష్టుని కొడుకుల్లాగా ! పాండవుల్లా ఒక స్టైచ్చిలాన్ పేంచేయండి" అన్నాడు తనకు తెలిసిన పాండిత్యం వెలగబెడుతూ.

"సరేకానీ, ఇంకో చీర ఇస్తాను. తక్కువైతే పదో ఐదో డబ్బులిస్తాను. ఆ డ్రమ్ కావాలి" అంటూ ఆ బుట్టమీదికి వంగి చిన్న చిన్న సామాన్లు బయటికి తీసి, మెల్లిగా డ్రమ్ తీయటానికి ప్రయత్నిస్తోంది. అలా వంగడంలో ఆవిడ పుస్తెల గొలుసు ముందుకు జారి, ఆవిడ మెడకి వేలాడినట్లు ఊగసాగింది.

"చెప్పానుగదండీ రాదని. మీరు ఆ చీర లేసినా, పైన ఏభై రూపాయలివ్వాలిసి వస్తారు" అంటూ ఆ ఊగుతున్న గొలుసు




వంకే చూడసాగాడు. అది ఆవిడ గమనించ లేదు. వాడికి ఆవిడ చేసే స్టీలు సామాన్ల చప్పుడు ఏమీ వినిపించట్లేదు. వాడు ఆ గొలుసువేపే చూస్తున్నాడు. అది అప్పుడే చేయించినట్లు మిలమిలా మెరుస్తోంది పుస్తెలు కూడా కొత్తవిలాగే ఉన్నాయి. వాడికి ఎట్లాగయినా ఆ గొలుసు కాజేయాలనిపించింది. 'ఈ బుట్ట నెత్తిన పెట్టుకుని ఎన్నాళ్ళు ఇలా తిరగటం, ఈ గొలుసు కొట్టేస్తే హాయిగా బ్రతకొచ్చు' అని వాడికి దుర్బుద్ధి పుట్టిందేమో, వాడు అలాగే ఒకసారి గొలుసు వేపు చూశాడు. అది అలా ఊగుతూనే వుంది ఆవిడ ప్రతి కదలికకి.

వాడు మెల్లిగా ఆ గొలుసుని ఒడుపుగా పట్టుకుని ఒక్క లాగు లాగాడు. అంతే గొలుసుకి పుస్తెలకి మధ్య దారం బాగా మెత్తబడినట్లు, అది వాడి చేతిలోకి ఈజీగానే వచ్చింది. ఒక్కసారి ఆవిడ ఆ అనుకోని సంఘటనకి బెదిరిపోయింది. మాటలు తడబడ్డాయి.

"గొ....గొ....గొలుసు. నా గొలుసు" అంటూ నత్తిగా అరుస్తుండగానే వాడు అప్పటికే కాంపౌండ్ దాటాడు. "పట్టుకోండి, గొలుసు తీసుకుపోతున్నాడు, పట్టుకోండి" అంటూ ఆమె కంఠం ఆమెకే వినిపించనట్లు అరుస్తోంది. మిట్టమధ్యాహ్నం. ఎండ దంచుతోంది. ఆ వేళప్పుడు బయటికి ఎవరొస్తారు ! రోడ్డుమీద ఒక్క పురుగు లేదు. వాడు రన్నింగ్‌లో "డిస్టింక్షన్" పుచ్చుకున్న వాడిలా యమస్పీడుగా పరిగెట్టాడు. అలా సందు చివరిదాకా వాణ్ని చూస్తూ నిల్చుంది. అంతకన్న ఏం చేయగలదు, రోడ్డుకి అడ్డంబడి పరిగెత్తుతుందా ఏం !

వణుకుతున్న చేతులతో ముందుహాల్లో వాడు ఉన్నపళాన వదిలేసిపోయిన బుట్టని మెల్లిగా ప్రక్కరూమ్‌లోకి లాగింది. బుట్ట చిందరవందరగా వుంది. నేలమీద కొంత సామాను పడేసి వుంది. మెల్లిగా అన్నీ తీసి బుట్టలోవేసింది. వాడు నెత్తిమీద గుడ్డ కూడా వదిలేసిపోయాడు — త్రాష్టుడు. బుట్టనిండా సామాను. డిష్‌లూ, చిన్నవి పెద్దవి గిన్నెలు, గ్లాసులు, పళ్ళాలు. అన్నీ ఒక్కొక్కటి డబుల్స్, త్రిబుల్స్-కళ్ళు తిరిగినయి, నీరసంగా వణుకుతున్న చేతులతో తలుపేసింది.

సాయంత్రం భర్త ఆఫీసు నుంచి వచ్చాడు. వసంత ఫుల్ మేకప్‌లో ఉంది. ఆశ్చర్యపోయాడు. "ఇవాళ జీతాలిచ్చేరోజు కాదే, మరి ఏదయినా సినిమాకా ? ఎందుకబ్బా?" అని అనుకుంటూ ప్రక్కరూంలో ఉన్న బుట్టెడు స్టీలు సామాన్లు చూసి ఆశ్చర్యపోయి, "వసంతా ఇన్ని సామాన్లెక్కడివి? మధ్యాహ్నం కొన్నావా?"

"అబ్బే లేదండీ ! ఊరికినే తీసుకున్నా" అంటూ జరిగినదంతా చెప్పి నవ్వింది. "మొన్న బజారెళ్ళినప్పుడు దొంగలభయంగా ఉందని ఒక రోల్డుగోల్డు పుస్తెల గొలుసు కొన్నా ! మూడు రోజులబట్టి వేసుకుంటున్నా! వాడు అది బంగారపు దనుకొని మోసపోయాడు. బుట్ట బుట్టా వదిలేసి చక్కాపోయాడు" అంటూ పడీపడీ నవ్వసాగింది.

"అంటే ముప్ఫయి రూపాయలతో మూడొందలు ఖరీదుచేసే డ్రమ్ము, ఇంకా చిన్నవి పెద్దవి సామానంతా కొట్టేశావన్న మాట! అదృష్టమంటే నీదేనోయ్. భలే ఛాన్స్ కొట్టావ్" అన్నాడు భర్త మహేష్.

లలిత